క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీ యువజన విభాగం అధ్యక్షుల నియామకం

ఎల్.ఎన్.పేట: పాతపట్నం నియోజకవర్గం లోని ఐదు మండలాలకు చెందిన వైఎస్సార్‌సీపీ యువజన విభాగ అధ్యక్షుల నియామకం ప్రక్రియ పూర్తయిందని పార్టీ కేంద్ర కార్యాలయం తాడేపల్లి నుంచి శనివారం ఒక ప్రకటన విడుదలైంది. పాతపట్నం మండలం యువజన విభాగం అధ్యక్షుడిగా గోకవలస రాము, మెళియాపుట్టికి బొడ్డు ప్రకాశ్, ఎల్.ఎన్.పేటకి బి.భాస్కరరావు, కొత్తూరుకు కర్ని నేన రమణ, హిరమండలానికి వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు చక్క బాలకృష్ణను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

నరసన్నపేట నియోజకవర్గంలో..

నరసన్నపేట: వైఎస్సార్‌సీపీ మండల యువజన విభాగం అధ్యక్షులను పార్టీ కేంద్రం కార్యాలయం శనివారం ప్రకటించింది. నరసన్నపేట మండలానికి పాగోటి గోవిందరావు, పోలాకి మండలానికి ఆర్. త్రినాథరావు, సారవకోట మండలానికి గాదిబోయిన గోవింద్, జలుమూరు మండలానికి జుత్తు నేతాజీ నియమించినట్లు ఉత్తర్వులు జారీ అయ్యాయి.

నేడు 2కే రన్

ఆమదాలవలస రూరల్: ఆడుదాం ఆంధ్రా ప్రారంభోత్సవ కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఉదయం 8.30 గంటలకు నియోజకవర్గ స్థాయి 2కే రన్ నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఎం.రవిసుధాకర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం ప్రారంభిస్తారన్నారు. పాలకొండ రోడ్‌లో ఉన్న వైఎస్సార్ జంక్షన్ నుంచి కృష్ణాపురం జంక్షన్ వరకు 2కే రన్ నిర్వహించడం జరుగుతుందన్నారు. ఆడుదాం ఆంధ్రాలో పేర్లు నమోదు చేసుకున్న క్రీడాకారులు, వార్డు సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, యువత, విద్యార్థులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఆడుదాం ఆంధ్రాపై అవగాహన ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, సచివాలయ సిబ్బంది

సారవకోట: మండల కేంద్రంలో ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంపై అధికారులు, సచివాలయ సిబ్బంది శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, గ్రామ వలంటీర్లతో మండల అధికారులు సమావేశం నిర్వహించారు. అనంతరం మండల కేంద్రంలోని జాతీయ రహదారిలో ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ హనుమంతరావు, ఎంపీడీఓ రాంబాబు, ఎంఈఓ రమణ పాల్గొన్నారు.

వెండి ఆభరణాల బహూకరణ



పాదపద్మాలను అందజేస్తున్న మాధవరావు దంపతులు

కొత్తూరు: మండల కేంద్రంలోని సీతారామాలయానికి కొత్తూరుకు చెందిన ఆంధ్రా మెడికల్ కాలేజీ విశ్రాంత చీఫ్ లైబ్రేరియన్ మల్లా మాధవరావు ఝాన్సీ దంపతులు కిలో వెండి ఆభరణాలు శనివారం అందజేశారు. ఆయంలోని ఆంజనేయ స్వామికి కిలో వెండితో పాద పద్మాలు తయారు చేయించారు. ఇప్పటికే ఆలయానికి లక్షలాది రూపాయల విలువ చేసిన సీతారామలక్ష్మణ, ఆంజనేయ స్వామి విగ్రహాలను బహూకరించారు. ఆలయ నిర్మాణానికి ఆర్థికసాయం చేశారు.

పోలీస్ స్టేషన్ సందర్శన



రికార్డులు తనిఖీ చేస్తున్న డీఎస్పీ శృతి

సరుబుజ్జిలి: శాంతిభద్రతలను కాపాడాలని శ్రీకాకుళం డీఎస్పీ వై.శృతి సూచించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌ను శనివారం సందర్శించారు. పలు రికార్డులు పరిశీలించారు. క్రైమ్ రేట్‌కు సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే అర్జీదారులతో స్నేహపూర్వకంగా వ్యవహరించి, ఫిర్యాదులు స్వీకరించాలని సూచించారు. ఆమదాలవలస సీఐ పైడయ్య, ఎస్సై కూటికుప్పల కృష్ణప్రసాద్ పాల్గొన్నారు.

స్వచ్ఛమైన ఓటర్ జాబితా రూపొందించాలి



మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ వెంకట్రామన్

మెళియాపుట్టి: రానున్న సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి రూపొందించే ఓటరు జాబితాలో తప్పులు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని జెడ్పీ సీఈఓ వెంకట్రామన్ అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్ఓలతో శనివారం సమీక్షించారు. ఓటరు జాబితాలో చేరికలు, తొలగింపులు, స్వచ్ఛీకరణ, ఓటర్ల నమోదు కీలకమన్నారు. చనిపోయిన వారి ఓట్లు తొలగించడంపై దృష్టి సారించాలన్నారు. తహసీల్దార్ సరోజిని ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో వైకుంఠ ఏకాదశి

ముక్కోటి ఏకాదశి పురస్కరించుకుని వెంకటేశ్వర, రామాలయాలు శనివారం భక్తులతో కిటకిటలాడాయి. వేకువజామున పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు దైవ దర్శనానికి ఆలయాల వద్ద బారులుతీరారు. ప్రత్యేకాలంకరణలో కొలువైన స్వామి వారిని దర్శించుకుని, విశేషపూజలు, అభిషేకాలు, అర్చనలు చేశారు. ఇదేరోజున ముక్కోటి దేవతలు భూలోకం వచ్చి, శ్రీమహావిష్ణువును పూజించారని పురాణాలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో వైకుంఠ ఏకాదశి నాడు ఉత్తరద్వారం గుండా విష్ణుమూర్తి దర్శనం చేసుకుంటే మూడుకోట్ల దేవతల దర్శన ఫలం వస్తుందని భక్తుల ప్రగాఢ విశ్వాసం. ఆలయాల వద్ద అన్నసమారాధనలు ఏర్పాటు చేశారు.

– సాక్షి నెట్‌వర్క్



సరుబుజ్జిలి: బూర్జ మండలం ఓవీపేటలో అఖండనామ సంకీర్తనలో పాల్గొన్న భక్తులు



ఆమదాలవలస రూరల్: ఆమదాలవలస పట్టణంలోని సత్యనారాయణస్వామి ఆలయం వద్ద వత్రాలు చేస్తున్న భక్తులు



హిరమండలం: రమాసత్యనారాయణ స్వామికి పుష్పయాగం నిర్వహిస్తున్న భక్తులు



జలుమూరు: శ్రీముఖలింగంలో పార్వతీపరమేశ్వరులను తిరువీధి నిర్వహిస్తున్న భక్తులు, అర్చకులు



జలుమూరు: శ్రీముఖలింగంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు



సరుబుజ్జిలి: పురుషోత్తపురంలో వైకుంఠ ఏకాదశి పూజల్లో పాల్గొన్న భక్తులు



పాతపట్నం: మండల కేంద్రంలోని వెంకటేశ్వర ఆలయం వద్ద క్యూలో ఉన్న భక్తులు



కొత్తూరు: వెంకటేశ్వర స్వామి ఆలయం వద్ద కోలాటమాడుతున్న మహిళలు



మెళియాపుట్టి: వేణుగోపాల ఆలయంలో తులసి మండపానికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు




సారవకోట: చీడిపూడిలోని వెంకటేశ్వర స్వామి ఆలయం వద్ద బారులు తీరిన భక్తులు



నరసన్నపేట: పట్టణంలోని వెంకటేశ్వరాలయం వద్ద బారులు తీరిన భక్తులు



నరసన్నపేట: పట్టణంలోని వెంకటేశ్వర ఆలయంలో వైకుంఠ నారాయణస్వామి అవతారంలో వెంకటేశ్వరుడు



పొందూరు: మొదలవలసలో పూజలందుకుంటున్న వెంకటేశ్వరస్వామి

సీఎం జగన్‌తోనే సుపరిపాలన



గుప్పెడుపేటలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

- నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్
- గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి విశేష స్పందన

పోలాకి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సుపరిపాలన సాధ్యమని, రాష్ట్రంలో సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా వెనకబడిన అనేక వర్గాలకు వైఎస్సార్‌సీపీ అండగా నిలబడిందని పార్టీ జిల్లా అధ్యక్షుడు, నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. తీరప్రాంత మత్స్యకార గ్రామం గుప్పెడుపేటలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ప్రభుత్వ అందజేసిన సంక్షేమ పథకాల లబ్ధిని గ్రామ వలంటీర్లు, అధికారులు, సచివాలయ సిబ్బందితో కలిసి ఇంటింటికీ వెళ్లి వివరించారు. రాష్ట్ర నృత్య అకాడమీ డైరెక్టర్ లండ యర్రయ్య ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. నియోజకవర్గంలో సాగర, మైదాన ప్రాంత మత్స్యకారులు వైఎస్సార్‌సీపీకి మద్దతు పలికి, సీఎం జగన్‌కు అండగా నిలబడ్డారని గుర్తుచేశారు. మత్స్యకార వర్గానికి చెందిన డాక్టర్ సీదిరి అప్పలరాజుకు మంత్రివర్గంలో సీఎం జగన్ చోటు కల్పించారన్నారు. మత్స్యకారుల సమస్యలు పరిష్కరించటంతోపాటు జిల్లాకు తలమానికంగా నిలిచే మూలపేట పోర్టును తీరప్రాంతానికి వరంగా అందిచారన్నారు. మత్స్యకార గ్రామాల్లో విద్య, వైద్యం, తాగునీరు, పరిపాలన సౌలభ్యం వంటి అంశాలను మెరుగుపర్చామన్నారు. ఎన్నికల సమీపిస్తున్న నేపథ్యంలో గ్రామాల్లో అలజడి సృష్టించేందుకు విపక్షాలు ప్రయత్నాలు చేస్తాయన్నారు. స్థానిక నాయకులు, గృహసారథులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ సలహాదారుడు ముద్దాడ భైరాగినాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు కణితి కృష్ణారావు, వైస్ ఎంపీపీ కోట అప్పారావు పాల్గొన్నారు.

అందరి సహకారంతోనే అభివృద్ధి



మాట్లాడుతున్న భరణికోట ఎంపీటీసీ రవికుమార్

మెళియాపుట్టి: అధికారులు, ప్రజాప్రతినిధుల సహకారంతోనే అభివృద్ధి సాధ్యమని భరణికోట ఎంపీటీసీ సభ్యుడు సవర రవికుమార్ అన్నారు. ఎంపీపీ, వైస్ ఎంపీపీలు వ్యక్తిగత కారణాలతో అందుబాటులో లేకపోవడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రవికుమార్ అధ్యక్షతన స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. గతంలో నిర్వహించిన సమావేశాల్లో గుర్తించిన సమస్యలు పరిష్కారమయ్యా? లేదా? అనే దానిపై సమాధానం ఇవ్వాలని పలువురు సభ్యులు అధికారులను కోరారు. సీఎస్ డీటీ భీమారావు మాట్లాడుతూ మండలంలో 271 రైస్ మిల్లుల ద్వారా ధాన్యం కొనుగోలు చేసేలా జియో ట్యాగింగ్ చేశామన్నారు. మండలంలోని 21 గ్రామాల్లో జల్ జీవన్ మిషన్ పనులు జరుగుతున్నాయని ఏఈ కళ్యాణ్ తెలిపారు. గిరిజనులకు ఉచితంగా మీటర్ అందించడమేకాకుండా వైర్, బోర్డ్ ఇతర సామగ్రి అదిస్తున్నట్లు విద్యుత్‌శాఖ ఏఈ తెలిపారు. మూడో విడత నాడు–నేడు పనులకు త్వరలోనే నిధులు రానున్నాయని ఎంఈఓ దేవేంద్రరావు అన్నారు. చీపురుపల్లి పంచాయతీ దాసుపురం పాఠశాలను మరమ్మతులు చేయాలని సర్పంచ్ ఈశ్వరరావు కోరారు. ప్రభుత్వం కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులను భాగసామ్యం చేయాలని పలువురు సభ్యులు సభ దృష్టికి తీసుకువచ్చారు. జెడ్పీటీసీ సభ్యుడు గూడ ఎండయ్య, వైఎస్సార్‌సీపీ మండల నాయకులు బైపోతు ఉదయ్ కుమార్, కోప్షన్ సభ్యుడు భాస్కరదాస్, రాష్ట్ర ట్రైకార్ డైరెక్టర్ సవర ఈశ్వరమ్మ, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మాధవరావు, ఎంపీడీఓ చంద్రకుమారి, ఏఓ ధానకర్నుడు, ఎంఈఓ–2 పద్మనాభరావు, పరిపాలనా అధికారి తిరుపతి పట్నాయక్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అబ్బాస్, సీడీపీఓ విమలారాణి, పలువురు వైద్యులు, ఏపీఓ రవి, ఏపీఎం లలిత పాల్గొన్నారు.

సందడిగా సెమీ క్రిస్మస్



సరుబుజ్జిలి: క్రీస్తు గేయాలు ఆలపిస్తున్న పాస్టర్లు



పాతపట్నం: క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న చిన్నారులు

సరుబుజ్జిలి: మండలంలోని యరగాం పంచాయతీ పరిధిలోని పెదమాలపేట గ్రామం ట్రినిటీ ప్రేయర్ ఆఫ్ ఫెలోసిప్ చర్చిలో శనివారం సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. క్రిస్మస్ కేక్ కట్ చేశారు. పలువురు ఆరాధకులు క్రీస్తు గేయాలను ఆలపించారు. జిల్లా క్రైస్తవ మ్యారేజ్ రిజిస్ట్రార్ ప్రత్తిపాటి ప్రసాదరావు, పాస్టర్లు గొంద్రు పీటర్, సంసోర్, దైవజనులు ప్రభుదాస్ పాల్గొన్నారు.

పాతపట్నం: స్థానిక రవీంద్రభారతి పాఠశాలలో శనివారం మినీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. చిన్నారుల వేషధారణలు ఆకట్టుకున్నాయి. హెచ్‌ఎం బి.ప్రభాకరరావు, డీన్ నాగరాజు, ఉపాధ్యాయులు, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా తక్షణసాయం అందజేత

కొత్తూరు: మండలంలోని గులివిందలపేటకు చెందిన చింతాడ రమేష్ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు. వైఎస్సార్ బీమా తక్షణ సాయం రూ.10 వేలను మృతిని భార్య విజయకు వైఎస్సార్‌సీపీ నాయకుడు గందవరపు నాగేంద్ర శనివారం అందజేశారు. పంచాయతీ కార్యదర్శి ఢిల్లేశ్వరరావు, సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ పద్మజ, డిజిటల్ అసిస్టెంట్ మణికంఠ ఉన్నారు.

మేస్త్రీ కొడుకు ఎస్‌ఐ పోస్టుకు ఎంపిక



వరహాలనాయుడు

ఆమదాలవలస రూరల్: మున్సిపాల్టీ పరిధి ఒకటో వార్డులో గల జగ్గశాస్త్రులపేట గ్రామానికి చెందిన హనమంతు వరహాలనాయుడు ఎస్‌ఐ పోస్టుకు ఎంపికయ్యారు. ఇటీవల విడుదలైన ఎస్‌ఐ ఫలితాల్లో బీసీఏ కేటగిరిలో సివిల్ ఎస్‌ఐగా ఎంపికయ్యారు. ఈయన తల్లిదండ్రులు హనుమంతు రామారావు కూలీల మేస్త్రీగా పనిచేస్తుండగా, తల్లి రమణమ్మ గృహిణి. పేదింటి కుటుంబానికి చెందిన వరహాలనాయుడు ఎస్‌ఐగా ఎంపికకావడం పట్ల తల్లిదండ్రులు, స్నేహితులు, గ్రామస్తులు అభినందనలు తెలియజేశారు.

కానిస్టేబుల్ నుంచి ఎస్‌ఐగా..



ఈశ్వరరావు

హిరమండలం: మండలంలోని కిట్టలపాడు గ్రామానికి చెందిన తులగాపు ఈశ్వరరావు సివిల్ ఎస్‌ఐగా ఎంపికయ్యారు. ఇటీవల వెల్లడైన ఎస్‌ఐ ఫలితాల్లో కర్నూలు రేంజ్‌కు ఎంపికయ్యారు. ప్రస్తుతం ఈశ్వరరావు కొత్తూరు పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. 2018లో కానిస్టేబుల్‌గా ఎంపికయ్యారు. తల్లిదండ్రులు నరసయ్య, రమణమ్మ సాధారణ వ్యవసాయ కుటుంబం. ఈశ్వరరావు ఎస్‌ఐగా ఎంపిక కావడంతో గ్రామస్తులు, స్నేహితులు అభినందిస్తున్నారు.

ఏపీటీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంఈఓలు, ఉపాధ్యాయులు

కొత్తూరు: ఏపీటీఎఫ్–2024 క్యాలెండర్‌ను మండల విద్యాశాఖ కార్యాలయంలో ఎంఈఓలు సి.హెచ్.గోవిందరావు, ఎస్.శ్రీనివాసరావు శనివారం ఆవిష్కరించారు. ఎంఈఓలు మాట్లాడుతూ నూతన సంవత్సరంలో విద్యాశాఖను మరింత అభివృద్ధి పథకంలో నడిపించేందుకు ఏపీటీఎఫ్ సహకరించాలని కోరారు. గత నెలలో ఎన్నికైన ఏపీటీఎఫ్ కొత్తూరు మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులతోపాటు కార్యవర్గాన్ని ఎంఈఓలు అభినందించారు. ఏపీటీఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు జి.గణపతి, బాలకృష్ణ, జిల్లా కౌన్సిలర్లు వై.సత్యానారాయణ, శాంతారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణ సద్వినియోగం చేసుకోవాలి



ధ్రువీకరణపత్రాలు అందజేస్తున్న ఎంపీపీ దీప

సరుబుజ్జిలి: ఉచిత శిక్షణ సద్వినియోగం చేసుకోవాలని బూర్జ ఎంపీపీ కర్నేని దీప అన్నారు. మండల కేంద్రంలో సత్యసాయి సేవా సంస్థల ద్వారా 46 మంది మహిళలకు 30 రోజులపాటు ఉచితంగా కుట్టు శిక్షణ ఇచ్చారు. శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు ఎంపీపీ శనివారం ధృవీకరణ పత్రాలు పంపిణీ చేశారు. సత్య సాయి సేవా సంస్థల జిల్లా కన్వీనర్ ఎన్ని లింగరాజు, మండల కన్వీనర్ జనార్దనరావు పాల్గొన్నారు.

ఆమదాలవలసలో..

ఆమదాలవలస రూరల్: మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలనే ఉద్దేశంతో ఉచిత ఉపాధి శిక్షణలు సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతుందని జిల్లా అధ్యక్షుడు ఎన్ని లింగరాజు అన్నారు. మున్సిపాల్టీ పరిధి లక్ష్మీనగర్‌లో ఉన్న సత్యసాయి భజన మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన స్కిల్ డెవలప్‌మెంట్ ముగింపు కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. మహిళలకు టైలరింగ్, మగ్గం వర్క్‌పై శిక్షణలు అందించి, సర్టిఫికెట్స్‌ను పంపిణీ చేయడం జరిగిందన్నారు. జోనల్ కన్వీనర్ ఎం.జనార్దనరావు, జిల్లా గ్రామసేవ ఇన్‌చార్జ్ ఎం.రవీంద్రబాబు, రాష్ట్ర విద్యాజ్యోతి ఇన్‌చార్జ్ ఎస్‌వీ గురుప్రసాద్, శిక్షణ నిర్వాహకులు కుసుమ, భజన మండలి కన్వీనర్ వాసుదేవరావు, తమ్మన బంగ్రరాజు, వి.జనార్దనరాజు, బండి ప్రతిమ, ఎన్ని నాగమణి పాల్గొన్నారు.

రూ.18 లక్షలతో రహదారుల నిర్మాణం



సంత వద్ద రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ధర్మాన కృష్ణచైతన్య

నరసన్నపేట: మేజరు పంచాయతీ పరిధిలోని పలు వీధుల్లో నూతనంగా నిర్మించనున్న రోడ్డు పనులను పోలాకి జెడ్పీటీసీ ధర్మాన కృష్ణచైతన్య శనివారం ప్రారంభించారు. వివిధ గ్రాంట్లతో సంతపేటపేట వద్ద రూ.3 లక్షలు, లక్ష్మణ్ణపేట వద్ద రూ.4.5 లక్షలు, వజ్రంపేటలో రూ.8 లక్షలు, గాంధీనగర్ చివరన రూ.3 లక్షలతో చేపట్టనున్న పనులను కృష్ణచైతన్య ప్రారంభించారు. అలాగే నరసన్నపేటకు వచ్చిన 2,400 ఆరోగ్యశ్రీ కార్డులను పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పంపిణీ చేశారు. నరసన్నపేట సర్పంచ్ బూరల్లి శంకర్, ఉప సర్పంచ్ ఎస్.కృష్ణబాబు, ఈఓ చిన్నారావు, కార్పొరేషన్ డైరెక్టర్ సాయి ప్రసాద్, దుర్గామల్లికార్జునస్వామి, బొబ్బాది ఈశ్వరారవు, ఎంపీటీసీలు నేతింటి రాజేశ్వరరావు, వైశ్యరాజు కేశవరావు, డేవిడ్, వార్డు సభ్యులు కృష్ణ ప్రసాద్, ఆర్.శ్రీధర్, బీఎల్ శర్మ, ఇప్పిలి నీలం, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

విద్యారంగంలో నూతన వరవడి



సరుబుజ్జిలి: పురుషోత్తపురంలో ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్న దృశ్యం



సరుబుజ్జిలి: బూర్జ మండలం తోటవాడ హైస్కూల్‌లో ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్న తమ్మినేని చిరంజీవినాగ్

సరుబుజ్జిలి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యారంగంలో డిజిటల్ విప్లవం తీసుకువచ్చారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవినాగ్ అన్నారు. బూర్జ మండలంలోని తోటవాడ జెడ్పీహెచ్‌ఎస్‌లో 8వ తరగతి విద్యార్థులకు శనివారం ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడ్కో రాష్ట్ర డైరెక్టర్ ఖండాపు గోవిందరావు, ఎంపీపీ కర్నేని దీప, వైస్ ఎంపీపీలు సూర్యారావు, కృష్ణమూర్తి, జెడ్పీటీసీ సభ్యుడు బెజ్జిపురం రామారావు, మండల సచివాలయం కో ఆర్డినేటర్ గుమ్మడి రాంబాబు, డీసీఎంఎస్ డైరెక్టర్ జల్లు బలరాంనాయుడు, అధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పురుషోత్తపురంలో..

సరుబుజ్జిలి: ప్రభుత్వం అందించిన ట్యాబ్‌లు విద్యార్థులు వినియోగించుకోవాలని పురుషోత్తపురం ఉప సర్పంచ్ పైడి నర్సింహప్పారావు తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు శనివారం ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఇన్‌చార్జ్ హెచ్‌ఎం బి.అప్పారావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీని విమర్శించే హక్కు కలమటకు లేదు

మెళియాపుట్టి/హిరమండలం/కొత్తూరు/ఎల్.ఎన్.పేట: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని విమర్శించే హక్కు టీడీపీ మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణకు లేదని వైఎస్సార్‌సీపీ నాయకులు అన్నారు. శనివారం మండల కేంద్రాల్లో విలేకరులతో మాట్లాడారు. కలమటకు మతిభ్రమించడంతోనే రాజకీయ భిక్ష పెట్టిన సీఎం జగన్‌ను ఏకవచనంతో సంభోదిస్తున్నారన్నారు. టీడీపీ ఇచ్చిన ప్యాకేజీకి అమ్ముడు పోయి, ఇసుక దందాలకు కక్కుర్తిపడి ప్రజా సమస్యలను గాలికి వదిలేసి పాతపట్నం ప్రజలను మోసం చేసి పార్టీ మారిన నీచమైన చరిత్ర కలమటకే దక్కిందన్నారు. కలమట రాజకీయ జీవితం ముగిసిందన్నారు. మహిళా ఎమ్మెల్యే అయిన రెడ్డి శాంతి పట్ల వ్యక్తిగతంగా విమర్శలు చేయడం తగదన్నారు. మహిళలపై ఆయనకు ఉన్న చులకన భావానికి ఆయన వ్యాఖ్యలు అద్దం పడుతున్నాయన్నారు. మెళియాపుట్టి మండల కన్వీనర్ పల్లియోగి, జెడ్పీటీసీ సభ్యుడు గూడ ఎండయ్య, మండల నాయకుడు ఉదయ్‌కుమార్, ఎల్.ఎన్.పేట మండలం వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు పెనుమజ్జి విష్ణుమూర్తి, లక్ష్మీనర్సుపేట పీఏసీఎస్ అధ్యక్షుడు కొల్ల కృష్ణ, పార్టీ నాయకులు రెడ్డి రామారావు, బలగ గోవిందరావు, ఎర్ర జనార్దన, సతివాడ శ్రీనివాసరావు, పంచిరెడ్డి అప్పలస్వామి, ధర్మాన సూర్యనారాయణ, పంచిరెడ్డి రామారావు, కొత్తూరు మండలానికి చెందిన వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి బూర్లె శ్రీనివాసరావు, గ్రామ సచివాలయం మండల కన్వీనర్ గండిలన ఆనందరావు, వ్యవసాయ సలహా కమిటీ సభ్యుడు లోతుగెడ్డ తిరుపతిరావు, వైఎస్సార్‌సీపీ మండల కార్యదర్శి సారిపల్లి హరి, పంకజ్‌దాస్, ఎంపీటీసీ వనుము లక్ష్మీనారాయణ, సర్పంచ్ నాస బాలకృష్ణ, పి.అశోక్, హిరమండలం నుంచి వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మీసాల వెంకట రామకృష్ణ, పీఏసీఎస్ అధ్యక్షుడు ఏవీ సురేష్, తదితరులు పాల్గొన్నారు.